కారుమంచి కాలువ పునర్నిర్మాణానికి చర్యలు

- ఎన్ఎస్పీ ఎస్ఈ రమణారెడ్డి

చీమకుర్తి: మండలంలోని రామతీర్థం సమీపంలో కర్నూలు రోడ్డును ఆనుకుని ఉన్న కారుమంచి సాగర్ కాలువను పునర్నిర్మించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు ఎన్ఎస్పీ ఎస్ఈ రమణారెడ్డి తెలిపారు. ఎన్ఎస్పీ డీఈ, మైనింగ్ డీడీ జగన్నాథరావుతో కలిసి శనివారం కారుమంచి కాలువను ఎస్ఈ పరిశీలించారు. దాదాపు రెండేళ్ల క్రితం రామతీర్థం రిజర్వాయర్ నుంచి రైతుల పొలాలు, చెరువులకు సాగర్ నీరు సరఫరా చేసే కారుమంచి కాలువ కట్ట విరిగి పక్కనే ఉన్న మధుకాన్ గ్రానైట్ క్వారీలో పడిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి కారుమంచి మేజర్ కింద ఉన్న 18 పంచాయతీలలో దాదాపు 25 వేల ఎకరాల ఆయకట్టు, వాటి పరిధిలో ఉండే చెరువులకు తాగు, సాగునీటి సరఫరా ప్రశ్నార్థకంగా మారింది. ఈ విషయాన్ని రైతు సంఘ నాయకులు ఇటీవల జేసీ దృష్టికి తీసుకెళ్లి కారుమంచి సాగర్ కాలువను పునర్నిర్మించాలని కోరారు. జేసీ ఆదేశాల మేరకు శనివారం అధికారులు కాలువను పరిశీలించారు. కాలువ పునర్నిర్మాణానికి అవసరమైన ఖర్చులను ఎస్టిమేషన్ వేసి ఉన్నతాధికారులకు వివరిస్తామని చెప్పారు. రైతు సంఘ జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు ఇరిగేషన్ అధికారులను కలిసి కాలువ పునర్నిర్మాణానికి త్వరగా చర్యలు తీసుకోవాలని కోరారు.


కారుమంచి కాలువను పరిశీలిస్తున్న ఇరిగేషన్, మైనింగ్ అధికారులు, రైతు సంఘ నాయకులు

కోరం లేక మండల సమావేశం వాయిదా


సమావేశాన్ని వాయిదా వేస్తున్న ఎంపీడీవో ఫణికుమార్‌నాయక్

కొత్తపట్నం: కొత్తపట్నం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేకపోవడంతో వాయిదా పడినట్లు ఎంపీడీవో ఫణి కుమార్ నాయక్ తెలిపారు. ఎంపీటీసీలకు సమాచారం అందించినప్పటికీ ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, కొంత మంది ఎంపీటీసీలు మినహా మిగిలిన వారు హాజరుకాకపోవడంతో మధ్యాహ్నం 4 గంటల వరకు వేచిచూసి సమావేశాన్ని వాయిదా వేసినట్లు చెప్పారు. సమావేశాన్ని మళ్లీ నిర్వహించే తేదీని ప్రకటిస్తామని తెలిపారు.

క్యాస్ట్ సర్టిఫికెట్లు త్వరితగతిన మంజూరు చేయాలి

అల్లూరు (కొత్తపట్నం): పెండింగ్‌లో ఉన్న కుల ధ్రువీకరణ పత్రాలను త్వరితగతిన మంజూరు చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక అల్లూరు–2 గ్రామ సచివాలయాన్ని శనివారం జేసీ ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయంలో సర్టిఫికెట్లు ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయో పరిశీలించారు. వెరిఫికేషన్ ప్రక్రియలో వస్తున్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ సర్టిఫికెట్లను వెంటనే ఇవ్వాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారికి ప్రభుత్వం ఉచితంగా కుల ధ్రువీకరణ పత్రాలు ఇస్తుందన్నారు. మండలంలో 2,800 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటన్నింటినీ నెలాఖరు లోగా ఇవ్వాలన్నారు. ఒంగోలు ఆర్డీఓ సుబ్బారెడ్డి, డీటీ అర్జున్‌రెడ్డి, వీఆర్ఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.


అల్లూరు–2 సచివాలయాన్ని పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

లక్కీ షాపింగ్ మాల్‌లో చీరలు మాయం

ఒంగోలు టౌన్: నగరంలో ఈ నెల 18వ తేదీ ప్రారంభించిన లక్కీ షాపింగ్ మాల్‌లో గుర్తు తెలియని దొంగలు చీరలు చోరీ చేశారు. పోలీసుల కథనం ప్రకారం... ఒంగోలుకు చెందిన గ్రంధి శ్రీనివాస్ కర్నూలు రోడ్డులోని తులసీరాం సెంటర్లో సినీతారలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల చేతుల మీదుగా లక్కీ షాపింగ్ మాల్‌ను అట్టహాసంగా ప్రారంభించారు. ప్రారంభం సందర్భంగా భారీగా ఆఫర్లు ప్రకటించడంతో ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రెండు రోజులుగా రద్దీ ఏర్పడింది. ఆ సమయంలో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. కస్టమర్లలా వచ్చి సిబ్బంది కళ్లు గప్పి చీరలతో ఉడాయించారు. అనుమానం వచ్చిన షాపు యజమాని శ్రీనివాస్.. శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో చీరలను పరిశీలించగా, 12 కాటన్ చీరలు కనిపించలేదు. ఒక్కో చీర విలువ సుమారు రూ.400 ఉంటుందని, మొత్తం చీరల విలువ రూ.4,800 ఉంటుందని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు


పూలంగి సేవలో కనకదుర్గమ్మ


శాకంబరీదేవి అలంకారంలో మాలిక పురీత్తమ్మ అమ్మవారు

ఒంగోలు మెట్రో: ఆషాడ మాసం శనివారం పౌర్ణమి సందర్భంగా నగరంలోని అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక గంటాపాలెంలోని పార్వతీ అమ్మవారికి, బాలాజీరావుపేటలో కనక దుర్గమ్మకు, కేశవస్వామిపేటలో విజయదుర్గమ్మ దేవస్థానంలో, లాయర్‌పేట షిరిడీ సాయిబాబా మందిరంలోని రాజరాజేశ్వరీ అమ్మవారికి, కేశవస్వామిపేటలోని లలితా ఆశ్రమంలో లలితా అమ్మవారికి, గద్దలగుంట బుర్ర బావి దగ్గర మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. చెన్నకేశవస్వామి దేవస్థానంలోని రాజ్యలక్ష్మి అమ్మవారికి, సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో నాగలక్ష్మి అమ్మవారికి, కొత్తపట్నం బస్టాండ్ నల్లూరి నర్సింగ్ హోం దగ్గర రాజ్యలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో, సమతా నగర్ కాలువ దగ్గర వెలసిన కనకదుర్గమ్మకు, కమ్మపాలెంలోని కాళికా అమ్మవారి దేవస్థానంలో, మంగమూరు రోడ్డు గాయత్రి మందిరంలో పంచముఖ గాయత్రి అమ్మవారికి, రంగారాయుడు చెరువు దగ్గర కంచి కామాక్షమ్మ దేవస్థానం, తదితర ఆలయాల్లో అమ్మవార్ల మూలవిరాట్లను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

శాకంబరీదేవి అలంకరణలో శ్రీ మాలికా పురీత్తమ్మ...

ఒంగోలు మంగమూరు రోడ్డు అయ్యప్పనగర్లో వెలసిన శ్రీ హరిహరసుత అయ్యప్పస్వామి క్షేత్రంలో వారాహి నవరాత్రుల్లో భాగంగా శనివారం శ్రీ మాలికా పురీత్తమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శాకంబరీదేవిగా శ్రీ మాలికా పురీత్తమ్మ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

నేడు గురుపూర్ణిమకు సిద్ధమైన బాబా మందిరాలు


విద్యుత్ కాంతులతో లాయర్‌పేట షిరిడీ సాయిబాబా మందిరం


విద్యుత్ దీపాలంకరణలో అచలానంద ఆశ్రమం

ఒంగోలు మెట్రో: నేడు గురు (వ్యాస) పూర్ణిమ మహోత్సవం సందర్భంగా ఒంగోలు నగరంలోని షిరిడీ సాయిబాబా మందిరాలు, అఖిలానంద ఆశ్రమం, భగవాన్ సత్యసాయి బాబా దేవస్థానాలు ప్రత్యేక కార్యక్రమాలకు ముస్తాబయ్యాయి. ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు, సామూహిక నామ సంకీర్తనలు, కోలాట ప్రదర్శనలు నిర్వహించనున్నారు. స్థానిక లాయరుపేట షిరిడీ సాయిబాబా మందిరం, సంతపేట షిరిడి సాయిబాబా మందిరం, కర్నూలు రోడ్డులోని సాయిబాబా మందిరం, పేర్నమిట్ట బాబా మందిరం, కొప్పోలు షిరిడీ సాయిబాబా మందిరం, త్రోవగుంట బాబా మందిరం, మంగమూరు రోడ్డులోని శివసాయి క్షేత్రంలో గురు వ్యాస పూర్ణిమ పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించనున్నారు. లాయర్‌పేట షిరిడీ సాయిబాబా మందిరంలో ఉదయం ఐదు గంటలకు కాకడా హారతి, ఆరు గంటలకు సాయిబాబాకు మంగళస్నానం, ఉదయం 11 గంటలకు అన్నసంతర్పణ, మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్న హారతి, సాయంత్రం ఆరు గంటలకు ఆచార్య భరద్వాజ మాస్టారుకి సామూహిక మల్లెల పూజ, రాత్రి ఏడు గంటలకు సాయిబాబాకి పూలంగి సేవ నిర్వహించనున్నట్లు షిరిడీ సాయి కల్చరల్ మిషన్ నిర్వాహకులు తెలిపారు. కర్నూలు రోడ్డు సాయిబాబా మందిరంలో ఉదయం ఏడు గంటలకు క్షీరాభిషేకములు, సామూహిక గురు చరిత్ర పారాయణం, సంధ్యా హారతి, పల్లకి సేవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

బెంబేలెత్తిస్తున్న జ్వరాలు

- ఒంగోలు మండలంలోని గ్రామాల్లో ఫీవర్ సర్వేలో భారీగా కేసులు
- 67 సాధారణ జ్వరాలు, 20 టైఫాయిడ్, 3 డెంగీ కేసులున్నట్లు వైద్యాధికారుల వెల్లడి


జ్వరంతో బాధపడుతున్న మహిళకు మందులు రాస్తున్న డాక్టర్ వాణి


ఫీవర్ సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

ఒంగోలు రూరల్: మండలంలోని గ్రామాలను జ్వరాలు పట్టిపీడిస్తున్నాయి. కొద్దిరోజులుగా జ్వరాలు పెరిగిపోవడంతో ప్రజలు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం వైద్యారోగ్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడి జ్వరపీడితుల వివరాలు సేకరించారు. కొన్ని గ్రామాల్లో శానిటేషన్ పనులు చేపట్టారు. తీర ప్రాంత గ్రామాల్లో జ్వరాలు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. సాధారణ జ్వరాలతో పాటు టైఫాయిడ్, డెంగీ జ్వరాలు కూడా ఉండటంతో కరవది ప్రభుత్వ వైద్యశాలలో పరీక్షలు నిర్వహించి అవసరమైన వారిని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వాణి ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. గుండాయపాలెం, పాతపాడు, చేజర్ల ఎస్సీ కాలనీల్లో డెంగీ కేసులు నమోదైనట్లు డాక్టర్ వాణి తెలిపారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుందర్‌ప్రసాద్ మాట్లాడుతూ కరవదికి చెందిన ఓ డ్రైవర్ లోడ్ వేసుకుని భద్రాచలం వెళ్లి తిరిగి రాగా మలేరియా వచ్చిందని తెలిపారు. గుండాయపాలేనికి చెందిన సాయికిరణ్‌కు డెంగీ లక్షణాలు ఉన్నాయని, ఎలీసా టెస్ట్ కోసం ఒంగోలు జీజీహెచ్‌కి తరలించామని తెలిపారు. గుండాయపాలేనికి చెందిన భాస్కర్‌కి డెంగీ పాజిటివ్ వచ్చిందని, ప్లేట్ లెట్స్ పడిపోవడంతో అతన్ని కూడా ఒంగోలు జీజీహెచ్‌కి తరలించామని చెప్పారు. ప్రస్తుతం మండలంలో 67 మందికి సాధారణ జ్వరాలు, 20 మందికి టైఫాయిడ్ జ్వరాలు, ముగ్గురికి డెంగీ జ్వరాలు ఉన్నట్లు గుర్తించారు. పలువురిని ఒంగోలు జీజీహెచ్‌కి సిఫార్సు చేశారు. అన్ని గ్రామాల్లో సర్వే పూర్తయిన తర్వాత వైద్య శిబిరాలు నిర్వహిస్తామని మెడికల్ ఆఫీసర్లు తెలిపారు. అన్ని జ్వరాలు డెంగీ, టైఫాయిడ్ కాదని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.

ఎస్పీని కలిసిన వైఎస్సార్ సీపీ మహిళా నేత ఇందిర


ఎస్పీని కలిసి అభినందిస్తున్న బడుగు ఇందిర

ఒంగోలు టౌన్: నూతన ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి బడుగు ఇందిర జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై జరుగుతున్న దాడుల గురించి మాట్లాడారు. దాడులను అరికట్టి ప్రశాంత వాతావరణం నెలకొనేలా తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీని ఆమె కోరారు. ఎస్పీ సానుకూలంగా స్పందించినట్లు ఇందిర తెలిపారు.